

నేడు ఉర్దూ జాతీయ సదస్సు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : స్థానిక పీవీకేఎన్ స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ కళాశాలలో ఉర్దూ విభాగం 23వ తేదీ గురువారం చిత్తూరు జిల్లాలో ఉర్దూ భాషా పరిస్థితులు' అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ జ్యోతి తెలిపారు. ఈ సదస్సుకు ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని ఉర్దూ ఆచార్యులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సదస్సు సంచాలకులు అన్వర్ హుస్సేన్ తన పరిశోధనా పుస్తకావిష్కరణ చేయనున్నారు. జిల్లాలోని ఉర్దూ, ఇతర భాషాభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఉర్దూ శాఖాధ్యక్షులు అన్వర్ హుస్సేన్ తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారధ్యంలో ఏపీ పురోభివృద్ధి సాధిస్తుందన్నారు.

కార్తీక్‌కు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- సంతాపం తెలిపిన సీఎం, ఇన్‌ఛార్జి మంత్రి, ఎంపి
- జవాన్ కుటుంబాన్ని ఓదార్చిన కలెక్టర్, ఎమ్మెల్యేలు
- పాడెను మోసిన ఆర్మీ అధికారులు
- పెద్దఎత్తున తరలివచ్చిన గ్రామస్తులు, ప్రజలు



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు మురళీ మోహన్, గురజాల



వీర జవాన్‌కు పాడెను మోస్తున్న ఆర్మీ అధికారులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భారతమాత కోసం జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులలో గాయపడి వీర మరణం పొందిన అమర జవాన్ కార్తీక్ యాదవ్‌కు తల్లి దండ్రులు, ఎగువ రాగిమాని పెంట గ్రామస్తులు కన్నీటితో వీడ్కోలు పలికారు. 28 ఏళ్ల బిడ్డను పోగొట్టుకున్న ఆ తల్లి శోకం తీరనిది. కానీ దేశం కోసం బిడ్డ ప్రాణాలర్పించాడని ఆ తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు, అన్న రాజేష్ గర్వపడుతున్నారు. ప్రభుత్వ అధికార లాంచనాల నడుమ బుధవారం చిత్తూరు జిల్లా స్వగ్రామమైన బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానిపెంటలో మధ్యాహ్నం 3.45 గంలలకు అంత్యక్రియలు ముగిసాయి. డెత్ సర్మనీ పరేడ్‌లో 4/8 గుర్ఖా రైఫిల్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్ సింగ్ గిల్ నేతృత్వంలో 35 మందితో పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేశారు. 23 మంది పెరేడ్ చేసి గాలిలోకి కాల్పులు చేశారు. అనంతరం అంత్యక్రియలను పూర్తిచేసారు. ఈ అంతిమ సంస్కారానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కె.మురళి మోహన్, గురజాల జగన్మోహన్, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పలమనేరు ఆర్డిఓ భవాని, బంగారుపాళ్యం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం, ఎంఈజీ సంఘం, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ప్రజలు పెద్దఎత్తున విచ్చేసారు.



అంత్యక్రియలకు పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు

పదేళ్ల క్రితం ఆర్మీలో చేరిన కార్తీక్ యాదవ్ రాజస్థాన్ ఆర్మ్ డ్ రెజిమెంట్‌లో ఏడేళ్ల పాటు పనిచేసిన తరువాత రెండేళ్ల క్రితం జమ్మూకు బదిలీ అయ్యారు. ఉగ్రవాదులను ఎరివేసే కూంబింగ్ రైఫిల్ విభాగంలో పనిచేస్తున్నారు. ఆదివారం జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన పోరులో కార్తీక్ తీవ్రంగా గాయపడి ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. వీర జవాన్ మరణ వార్తపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రి నారా లోకేష్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వీరజవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు.

ప్రాణాలు చాలా విలువైనవి..

- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదు
- హెల్మెట్ ధరించి వాహనాలు నడపండి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రాణాలు చాలా విలువైనవని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలులో భాగంగా చిత్తూరు దర్గా సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు వాకథాన్ కార్యక్రమాన్ని చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్ మోహన్‌తో కలసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చూడా ఛైర్మన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పి రాజశేఖర్ రాజు, డిటిసి నిరంజన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గత మూడు సంవత్సరాల కాలంలో దాదాపు 350మంది రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారని, గత సంవత్సర కాలంలోనే దాదాపు 120మంది ప్రాణాలు కోల్పోయారని, 50 శాతం ద్విచక్ర వాహనదారులు మరణించారని, ఇందులో 90శాతం వరకు యువత మరణించారన్నారు. జాతీయ రహదారి భద్రతపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమించిందన్నారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా రోడ్ సేఫ్టీ మీటింగ్‌లు నిర్వహించామని, వాకథాన్ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని కళాశాలలకు అధికారులు వెళ్ళి యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడపడం, మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వలన ప్రమాదాల భారినపడతారని అన్నారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన కొద్దిపాటి గాయాలతో ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, రోడ్డు భద్రతలో భాగంగా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని, ప్రజలు సహకరించాలని కోరారు.



రోడ్డు భద్రత వారోత్సవాలు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పిహెచ్‌సిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు మెరుగైన చికిత్సల కోసం ప్రభుత్వం అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను బుధవారంఏర్పాటు చేసింది. డాక్టర్ విజయ్ చంద్ర గర్భవతులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించి గర్భస్థ శిశు వు పెరుగుదల, కదలికలు, లోపాలు, పరిస్థితులను వివరించారు. ప్రతి బుధవారం గర్భవతులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, అత్యవసరమైతే అన్నివేళలా అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆడ, మగ లింగ నిర్ధారణ చేయరాదని అలా చేస్తే చట్ట ప్రకారంకఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న డాక్టర విజయ్ చంద్ర

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకొని జనవరి 25వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవంపై ఈ పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ పోటీలలో గేట్ పుత్తూరుకు చెందిన ఎంబి అభిరామి మొదటి బహుమతిని, వ్యాసరచన పోటీలలో విజయపురం మండలంకు చెందిన కే.నందా మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఓటు హక్కు పైన, ప్రజాస్వామ్య వ్యవస్థపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలకు విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ఈ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు.



చిత్రలేఖన, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డుపై రసాయన నీరు..

- బట్టబయలైన మిషన్ డైయింగ్ యూనిట్ల నిర్వాకం
- రసాయనాల నుంచి తమకు విముక్తి ఎప్పుడంటున్న జనం

ప్రజాశక్తి- విజయపురం (నగరి):

నగరి మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్లు డేంజర్ బెల్ మోగిస్తోంది. నిబంధనలకు పాతర వేస్తోంది. ప్రమాదకర రసాయన వ్యర్థ జలాలు మురుగునీటి కాలువలు, నీటిపారుదల కాలువల్లోకి, చెరువుల్లో, ఖాళీ స్థలాల్లో కనిపిస్తోంది.

నగరి పురపాలక సంఘంలో18 మిషన్ డైయింగ్ యూనిట్లు ఉండగా 90 దాకా మేన్యువల్ డైయింగ్ యూనిట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మిషన్ డైయింగ్ యూనిట్లు స్వంతంగా ఈటీపీ పెట్టుకోవాలి. మేన్యువల్ డైయింగ్ యూనిట్లకు కామన్ ఈటీపీ ఉంది. 18 భారీ డైయింగ్ యూనిట్లు ఉంటే అందులో రెండింటికి మాత్రమే అనుమతి ఉందని ఆ యూనిట్లు కూడా నిబంధనలు పాటించడం లేదని మున్సిపల్ సమావేశంలోనే అధికారులు తేటతెల్లం చేశారు. నీటిని జింక్, ఆర్సినిక్ కలిసి ఉందని వీటి కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని తేల్చి చెప్పారు. దీంతో నెలరోజుల్లోపు డైయింగ్ యూనిట్ల మూకుమ్మడిగా ఆపేయడంపై కీలక నిర్ణయం తీసుకుంటామని కౌన్సిల్ ప్రకటించింది. ఒకవైపు మున్సిపల్ కౌన్సిల్ డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తుంటే మరోవైపు చింతలపట్టెడలో మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి పొగలు కక్కుతూ వేడి రసాయనీరు రోడ్లపైన, కాలువల్లోను ప్రవహించడం దుమారం లేపింది.



నగరి చెరువును ఆనుకొని ఉన్న ఈటీపీ పంప్‌హౌస్ సమీపం కూడా కొత్తపేట, ఏకాంబరకుప్పం, సత్రవాడల్లోని మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయన నీరు పొగలు కక్కుతూ నిల్వ చేరింది. మున్సిపల్ పరిధిలోని మాన్యువల్ డైయింగ్ యూనిట్లు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డైయింగ్ ఆపేశాయి. దీంతో కామన్ ఈటీపీ కూడా నిర్వహణలో లేదు. మిషన్ డైయింగ్ యూనిట్లకు స్వంత ఈటీపీలు ఉన్నాయి. అయితే రసాయన నీరు పలు ప్రాంతాల్లో పారడం మిషన్ డైయింగ్ యూనిట్లు ఈటీపీ వినియోగించడం లేదన్న నగ్నసత్యాన్ని చాటిచెబుతోంది.



రోడ్లపై ప్రవహిస్తున్న రసాయనపు నీరు



చుట్టుపక్కల కుంటల్లో చేరిన దృశ్యం..

గ్రామపంచాయతీల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం: మండలంలోని గ్రామపంచాయతీలను చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి మెదవాడ గ్రామపంచాయతీలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ పారిశుధ్యం కార్యక్రమాలలో భాగంగా గ్రామపంచాయతీలలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు , తాగునీటి సరఫరా మొదలైనవి సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతిరోజు గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని కనుక అన్ని గ్రామపంచాయతీలలో డీప్ శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఎస్ఆర్ పురం మండలంలో ఇంకా ప్రారంభించని 9 ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్లు వెంటనే ప్రారంభించి మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీలలో చెత్త దిబ్బలు పేడ దిబ్బలు గ్రామ పరిసరాలలో లేకుండా తప్పనిసరిగా శుభ్రం చేయించాలని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహకారంతో అన్ని గ్రామ పంచాయతీల్లోని ఓహెచ్ఎస్ఆర్, జిఎల్ఎస్ఆర్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని, రోడ్డునకు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న ముళ్ళపొదలు తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తే అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్ ద్వారా గ్రామపంచాయతీలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి వాటి ద్వారా వర్మీ కంపోస్ట్ తయారుచేసి గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చాలని, పాక్షికంగా ఉపయోగించిన ఎస్‌డబ్ల్యూపిసి సెంటరు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో మోహన మురళి, విస్తరణ అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి గ్రామసచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. దేవలంపేటలోని పంచాయతీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు.



గ్రామపంచాయతీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న సుధాకర్ రావు

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: జర్నలిస్టుల సంక్షేమ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఉద్యమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర నాయకులు కవరికుంట్ల జయరాజ్ జిల్లా ఎన్నికల అధికారి చల్లా జయచంద్ర, జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం కార్వేటినగరం మండల కేంద్రంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరులో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి నిధులు కేటాయించాలని, అక్రిడేషన్ కార్డు మంజూరులో సరళతరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులో పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. తమిళనాడు ప్రభుత్వం అమలు చేసిన విధంగా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యాన్ని రూ.15000లు ఇవ్వాలని, జర్నలిస్టులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి చల్లా జయచంద్ర నియోజకవర్గ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. సభ్యులు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీని రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ

అధ్యక్షులు బి.మోహన్ దాస్ మహా న్యూస్ టీవీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మునికృష్ణ సుమన్ టీవీ, ఉపాధ్యక్షుడులు మోహన్‌రెడ్డి ప్రజాశక్తి, శరవణ కుమార్ వార్త, ప్రధాన కార్యదర్శిగా దేవరాజులు, ఆంధ్రప్రభ, ఆర్గనైజం కార్యదర్శిగా ఎం.సుబ్రహ్మణ్యం సాక్షి టీవీ, సహాయ కార్యదర్శులు మహేంద్ర సూర్య, కే.సుధాకర్ ప్రజాశక్తి, కోశాధికారి రూప్ చంద్రారెడ్డి ఆంధ్రప్రభ ఎన్నుకున్నారు. నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణకు ఆహ్వానం



ప్రజాశక్తి- పుంగనూరు: రిపబ్లిక్ డే పర్వదినానికి జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ సైనిక కమ్యూనిటీ హాల్‌కు హాజరుకావాలని ఆ సంఘ గౌరవాధ్యక్షులు, విశ్రాంత డీఎస్పి సుకుమార్ బాబు పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా బాబును ఆహ్వానించారు. ఆయన స్వగృహంలో మాజీ సైనికులు అందరూ కలిసి బుధవారం ఆహ్వానించడం జరిగింది. ఈనెల 26న రిపబ్లిక్ డే పర్వదినానికి పట్టణానికి సమీపంలో రాంపల్లి గ్రామం వద్ద ఉన్న మాజీ సైనిక కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని కోరారు. మాజీ సైనిక సంఘం అధ్యక్షులు రెడ్డప్ప, వైస్‌ప్రెసిడెంట్ జవహర్, కార్యదర్శి ప్రతాప్, ఈసీ మెంబర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సామాజిక తనిఖీ బృందం సమావేశం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రంలోని సోమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నెల్లిమంద ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం మూడవరోజు బుధవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు తదిత అంశాలపై చర్చించారు. సామాజిక తనిఖీ పారదర్శకత జవాబుదారీ సంస్థ నుండి వచ్చిన ఎస్ఆర్పి మల్లికార్జున, వీరభద్రారెడ్డి, సుధాకర్ బృందం తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీకి వంటల అమ్మలను, మరుగుదొడ్ల నిర్వహణకు ఆయాను విద్యార్థులు కూర్చునేందుకు డెస్కులను ఇతర సౌకర్యాలను కల్పిస్తోందని వీటన్నిటిని విద్యార్థులకు అందే విధంగా తల్లిదండ్రులు కూడా పాఠశాలను పర్యవేక్షించి ఉపాధ్యాయులతో చర్చించి పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పలువురి విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చునేందుకు డెస్కులు చాలడం లేదని విద్యార్థులకు ఆటస్థలం లేదని మరికొన్ని సమస్యలను సామాజిక తనిఖీ బృందానికి తెలియజేశారు. దీనిపై వారు నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తామని విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తాము ప్రతిపాదన పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శివరత్నమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్న తనిఖీ బృందం

విద్యుత్ లోకదాలత్‌కు 10 ఫిర్యాదులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న విద్యుత్తు అధికారులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు, పుంగనూరు, సదుం మండలాలకు సంబంధించి సిజిఆర్ఎఫ్ మీటింగ్ పలమనేరు సబ్ డివిజన్ ఆఫీసులో ఏడీఈ చిన్నప్ప అధ్యక్షతన బుధవారం విద్యుత్ లోకదాలత్ జరిగింది. ఈకార్యక్రమానికి మొత్తం పది అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు అందిన అర్జీలకు రసీదులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి వారివారి పరిధిలోని విద్యుత్ ఏఈలకు పంపినట్లు బిసిజిఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలియజేశారు. సిజీఆర్ఎఫ్ సభ్యులు రామమోహన రావు, అంజనీ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పుంగనూరు డిఈఈ శ్రీనివాస్ మూర్తి, ఏఈ రామకృష్ణ, సిబ్బంది. పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పాడి రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. బుధవారం గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడి మురళీమోహన్ మాట్లాడుతూ పశువులకు దూడలకు, మేకలుగొర్రెలకు నట్టల నివారణ మందు, పిడుదల నివారణ మందు వేయిస్తున్నామని అలాగే దూడల ఎదుగుదల పశువుల పాల దిగుబడిపై ప్రత్యేక వైద్యం నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని వీరక్క నెల్లూరు, మహాదేవ మంగళం పంచాయతీల్లో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ గోవిందయ్య, ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగ ఆంజనేయులు, గోపాలమిత్ర తులసి పాల్గొన్నారు.



దూడకు మందు వేస్తున్న శ్రీధర్ యాదవ్

మిట్టపల్లిలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం కందూరు పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో బుధవారం పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 262 పశువులకు పిడుదుల మందు పిచికారి, 225 ఆవులకు, 36 దూడలకు, 320 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు తాపించడం, 60 కోళ్లకు వ్యాధి నిరోధక మందులు ఇవ్వడం, 40 గర్భకోస వ్యాధి చికిత్స అవసరమైన ఆవులకు చికిత్స అందించడం చేసినట్టు పశు వైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సహదేవ నాగరాజు, అనూష, సురేష్, సుధాకర్, ఓబులేసు రైతులు పాల్గొన్నారు.



కోళ్లకు వ్యాధి నిరోధక మందులను తాగిస్తున్న డాక్టర్ చందన ప్రియ

25న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 25వ తేదీ శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లామెంట్ ఎక్స్చేంజ్ సీడప్, అలాగే డీఆర్డీఎ సంయుక్తంగా నిర్వహించే జాబ్ మేళాకు లోటస్ ఎన్జర్ ప్రైజెస్, శ్రీరాం చిట్స్ లిమిటెడ్ వారు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. కనీస విద్యార్హత ఇంటర్మీడియట్, డిగ్రీ పాస్ అయిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ అవకాన్ని నిరుద్యోగ యవతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81425 09017 సంప్రదించలన్నారు.

అనాథలకు ఆశ్రయం కల్పించండి



ఆశ్రమ నిర్వాహకులకు వినతి పత్రాన్ని అందిస్తున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రక్షణ అనాథ ఆశ్రమం వారు గుడుపల్లి మండలం మిట్టపల్లి గ్రామంలోని అనాథ కుటుంబానికి రక్షణ కల్పించాలని జడ్పిటిసి కృష్ణమూర్తి అనాథ ఆశ్రమం నిర్వాహకులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో ఒంటరి మహిళ నలుగురు పిల్లలతో గ్రామ పరిధిలోని పాఠశాల ప్రాంగణంలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. ఒంటరి మహిళలకు నివాసయోగ్యమైన స్థలం లేదని, తన కుమార్తెలతో కలిసి జీవించడానికి యోగ్యమైన స్థలం లేనందున రక్షణ అనాథ ఆశ్రమం వారు వారిని రక్షించాలని కోరుతూ అనాథ ఆశ్రమం నిర్వాహకులకు వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఆశ్రమ నిర్వాహకురాలు ఒంటరి మహిళల కుటుంబానికి రక్షణ కల్పించడానికి అంగీకరించినట్టు తెలిపారు.

రూ.26 వేలు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సమితి సభ్యులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అభాగ్యులకు సహృదయ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు టి.తిరుమలయ్య అన్నారు. కార్వేటినగరం ముస్లిం కాలనీకి చెందిన ధంకా అఫ్జల్ కొన్నాళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న సహృదయ సేవా సమితి సభ్యులు బుధవారం తక్షణ సహాయం కింద ఆసుపత్రి ఖర్చులకు ట్రస్ట్ ద్వారా మొత్తం రూ.26 వేలు నగదు బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలయ్య, జయచంద్ర మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అప్పన్న హస్తంగా సహృదయ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ నిలుస్తోందని గుర్తుచేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అఫ్జల్‌ను ఆదుకోవడానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. సంస్థ సభ్యులు న్యామతుల్ల, సర్దార్, దేవా, పన్నీర్ సెల్వం పాల్గొన్నారు.

విద్యార్థులు శిక్షణా తరగతులు



శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్

ప్రజాశక్తి- యాదమరి : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 100శాంతి ఉత్తీర్ణత పరిధిలో సాధించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల శిక్షావ తరగతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్ తెలిపారు. బుధవారం కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు రుక్మణమ్మ, హెచ్ఎల్ఎన్ ప్రసాద్ పర్యవేక్షించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, శిక్షణా తరగతులు, మూడు నెలల కాలంలో విద్యార్థులను అన్ని రకాలుగా పరీక్షలకు తర్ఫదు చేసే విధంగారో 100 రోజుల ప్రణాళిక నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బడికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు ఎపి.లలిత, ఉపాధ్యాయులు కనకాచారి, నరసింహారెడ్డి, మురళీధర్, ఎం.భారతి, నీలవేణి పాల్గొన్నారు.

దళిత సత్ర సాధన కొరకు అందరూ కలిసి రావాలి



ప్రజాశక్తి- ఐరాల: రాజకీయ పార్టీలకు అతీతంగా దళితులంతా ఏకమై దళిత సత్రాన్ని సాధించుకోవాల్సిన అవసరం ఉందని కాణిపాకం దళితసత్రం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విశ్రాంత సహాయ కమిషనర్ జి కేశవులు పిలుపునిచ్చారు. బుధవారం కాణిపాకంలో 14 గ్రామాల స్థానిక దళిత ఉభయదారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో దళితులకు కేటాయించిన సత్రాన్ని ఆలయానికి ఇవ్వడం జరిగిందని, ఆలయ అధికారులు 2000 సంవత్సరం నుండి దళితులకు ఇవ్వాల్సిన సత్రం మరింత కాలయాపన చేస్తున్నందుకు, దాన్ని అతి త్వరలో సాధన చేయడం కొరకు ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం అగరంపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణంలో కాణిపాకం దళితసత్రం సేవాసమితి, చంద్రప్రభ ఉభయదారుల ఆధ్వర్యంలో బహిరంగ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఎంపి దగ్గుమల్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కాణిపాక ఈఓ పెంచల కిషోర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 14గ్రామాలకు చెందిన చంద్రప్రభ ఉభయదారులు, గ్రామపెద్దలు, నాయకులు హాజరు కావాలని కోరారు. మునీంద్రా, మాజీ సర్పంచ్ నటరాజ్, మాజీ ఎంపీటీసీ చిరంజీవి, గుణ, మధు పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ యువనేత రావిళ్ళ చందు చౌదరిలి

ప్రజాశక్తి- వెదురు కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పురోభివృద్ధి వైపు పయనిస్తుందని వెదురుకుప్పం మండల టిడిపి యువనేత రావిళ్ళ చందు చౌదరి అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, తిరుమల శ్రీవారి తీర్థం ప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా మండలంలోని సమస్యలను మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. యువత పార్టీకి వెన్నుముకలా పని చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.



మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చందు చౌదరి

ఎమరాల్డ్స్‌లో ఇన్ఫోసిస్ శిక్షణా శిబిరం



శిబిరం ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అకాడమీ ప్రతినిధులు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఐసిటి అకాడమీ చెన్నైవారు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థులకు ఫినీషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ పేరిట ఉద్యోగ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారని కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం తెలిపారు. ప్రధానంగా ఈ శిక్షణ శిబిరం ద్వారా బ్యాంకింగ్, ఐటి, ఇన్సూరెన్స్, కమ్యునికేషన్ స్కిల్స్ పై నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిటి అకాడమీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రశాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మధన్ మోహన్, శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి కుర్చీలు వితరణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కార్ల్ కంపెనీ క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ వారు బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యులు శిరీష మాట్లాడుతూ క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ వారు మూడు సీట్ల స్టీల్ 5, కుర్చీలు (20) అందివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ వైద్యశాలలకు కుర్చీల కొరత తీరదని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ఏపీజెడ్ ఎం.శ్రీనివాస బాబు, లైజన్ ఆఫీసర్ రమేష్, బాబు, తిరుపతి డిఎం జగదీష్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

26న స్కూటర్ ర్యాలీ జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్.జనార్ధన్

ప్రజాశక్తి- పలమనేరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరిగే స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ టి.జనార్ధన్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉమాపతి నాయుడు కోరారు. బుధవారం పలమనేరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా రైతాంగం పండించే అన్ని పంటలకు కనీసం మద్దతు ధర (ఎంఎస్పి) కల్పించాలని ఒక సంవత్సరంకు పైగా ఉద్యమిస్తున్నా కేంద్రం సాచివేత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. గతంలో రైతాంగ ఉద్యమంతో వెనకడుగు వేసి ప్రభుత్వం మూడు నల్ల చట్టాలు ఉపసంహరించుకున్నా నేడు తిరిగి మరో రూపంలో దొడ్డిదారిన తిరిగి తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. నూతన విద్యుత్ చట్టాన్ని సత్వరం ఉపసంహరించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులకు కల్పించాలని కోరారు. పలమనేరులో 26 న జరిగే స్కూటర్ ర్యాలీకి రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.కాటమయ్య, ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు హజరవుతారని తెలిపారు. రైతు కూలీ సంఘం కార్యదర్శి ఉమాపతి నాయుడు, మంజు, శిద్ధారెడ్డిపాల్గొన్నారు.

మల్లనూరులో ఆగనున్న రైలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మీదగా బెంగళూరు వెళ్ళు పలు రైళ్ల మండల పరిధిలోని మల్లానూరు గ్రామంలో తాత్కాలికంగా నిలుపదాల చేయనున్నట్టు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భారత్ అమృత్ కార్యక్రమంలో భాగంగా కుప్పం రైల్వే స్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. కావున ఈనెల 23వ తేదీ నుండి 17 రోజులపాటు కుప్పం రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్ ఫామ్‌లో ఆగు రైళ్లను తాత్కాలికంగా నిలుపుదల చేయుటకు కుదరదని, కావున రైల్వే అభివృద్ధి పనులు పూర్తి అయ్యేవరకు కుప్పం నుండి బెంగళూరు వెళ్ళు రైళ్లు కుప్పంలో నిలుపుదలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై స్పందించిన స్థానిక కూటమి నాయకులు, సాయి మాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కుప్పం నుండి బెంగళూరుకు ప్రతిరోజు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం మండల పరిధిలోని మల్లనూరు గ్రామంలో కానీ, నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి గ్రామంలో కానీ రైళ్ల నిలుపుదల చేయుటకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు మల్లానూరు రైల్వే స్టేషన్లో తాత్కాలికంగా రైళ్ళను నిలుపుదల చేయుటకు అంగీకరించినట్టు తెలిపారు. సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు, నాయకులు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: భూ సమస్యల పరిష్కారానికి మార్గమే రీసర్వే అని డిఆర్ఓ జయరాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని 50 కనికాపురం రెవెన్యూలో రీసర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలుంటే రీసర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తహశీల్దార్ లోకనాథ పిల్లై, డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వే సురేష్ బాబు, రూత్ బేబీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ గెరిగదొన సమీపంలో తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం తిరుపతి నుంచి కార్వేటినగరం పల్లిపట్టుకు వెళ్లే బస్సు మరో వాహనానికి దారి ఇవ్వబోయి రోడ్డు పక్కనే గతంలో టెలిఫోన్ వైర్ల కోసం తీసిన గోతిలో దిగబడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'పాడి'పై మరణ మృదంగం

- కళ్లెదుటే కడతేరుతున్న మూగజీవాలు
- వందల సంఖ్యలో మృత్యువాత
- ఆందోళనలో పాడి రైతులు



వ్యాధితో మృతి చెందిన మూగజీవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విభజిత తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో అధికశాతం మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. కరువు కాటకాలకు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమను నమ్ముకుని బతుకుతుంటారు. అయితే మనిషి మనుగడకు దోహదపడే పశు సంపదను పరిరక్షించడంలో పశుసంవర్ధకశాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం, సత్యవేడు మండలాల్లో మూగజీవాలు మృత్యువాత పడుతుండటమే ఇందుకు ఉదాహరణ. గొంతువాపు, గాలికుంటు, పిల్లి ముసర, కొక్కెర తెగులు, అంతుచిక్కని వైరస్‌లు మరణ మృదంగం ఆడుతూ మూగ జీవాలను పొట్టన పెట్టుకుంటున్నాయి. కళ్లెదుటే నోరులేని పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు కడతేరి పోతుండడంతో పాడి రైతుల బాధలు వర్ణనాతీతం. ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సిన పశు వైద్యాధికారులు 'చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్న చందాన ఇప్పుడిప్పుడే టీకాలు వేస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. కొన్ని చోట్ల సకాలంలో టీకాలు వేసినా అవి పనిచేయకపోవడంతో పశు సంపద తరిగిపోతోంది. బూస్టర్ డోస్‌లు ఇచ్చివుంటే పరిస్థితి వేరుగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వందల్లో మృత్యువాత

తూర్పు మండలాల్లోని పశువులను ప్రస్తుతం గొంతువాపు, గాలికుంటు, లంపీ స్కిన్ వ్యాధులు గజగజ వణికిస్తు న్నాయి. గొంతు వాపు, లంపీ స్కిన్ వ్యాధుల కారణంగా వందల సంఖ్యలో దూడలు మృత్యువాత పడ్డాయి. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో సుమారు 150 వరకు దూడలు చనిపోయినట్లు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో పెద్ద బర్రెలు, ఆవులు కూడా చనిపోయినట్లు వాపో తున్నారు. అంతుచిక్కని వైరస్ వల్ల చనిపోయిన కోళ్ల సంఖ్యను చెప్పలేమంటున్నారు రైతులు. డిసెంబరులో ఏర్పడ్డ వరుస తుపానుల వల్ల పారిశుధ్యం దెబ్బతినడం, జనవరిలో ఒక వైపు అనుకోని వర్షాలు, ఇంకో వైపు చలి తీవ్రత పెరగడం వంటి కారణాల వల్ల అంతు చిక్కని వైరస్ కోళ్లను కబళిస్తోందని రైతులు చెబుతున్నారు. కరోనా లక్షణాలే కోళ్లలో కనిపిస్తున్నాయని, రాత్రికి రాత్రే ఊపిరితిత్తుల సమస్యతో జీవాల ఊపిరి ఆగిపోతున్నట్లు చెప్తున్నారు. ముఖ్యంగా జాతి కోళ్లు, పెరటి కోళ్లు, పందెం కోళ్లకు ఈ వైరస్ సోకడం వల్ల అపార నష్టం వాటిల్లుతోంది. ఇక కొక్కెర తెగులు తన ప్రభావాన్ని చూపుతుండడంతో నాటు కోళ్లు కుప్పకూలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. పిల్లి ముసర వ్యాధి ఎక్కువ శాతం మేకలను బలిగొంటోంది. వ్యాధిని గుర్తించే లోపే జీవాలు మృత్యువాత పడుతుండడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. తూర్పు మండలాల్లోని ప్రతి గ్రామాన పాడిపై వ్యాధులు మరణ మృదంగం మోగిస్తున్నాయి.

కొరవడిన అవగాహన

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 67,406 మంది బర్రెల పెంపకం దారులు, 86,591 మంది ఆవుల పెంపకం దారులు, 23,925 మంది గొర్రెలు, మేకల పెంపకం దారులు ఉన్నారు. అయితే పాడి రైతులకు మూగజీవాలకు వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కరువైంది. ఏ కాలంలో ఏ వ్యాధులు సంక్రమిస్తాయి? టీకాలు వేసుకోవడం, వ్యాధులు సంక్రమిస్తే చికిత్సలపై అవగాహన లేకుండా పోయింది. ఈ అంశాలపై పాడి రైతులకు విరివిగా అవగాహన కల్పించడంలో పశు వైద్యుల లోపం కనిపిస్తోందన్న విమర్శ లు ఉన్నాయి. వర్షాకాలంలో పశు పక్షాదులకు వ్యాధులు వస్తుంటాయి. వ్యాధులు రాకుండా పశు సంవర్ధక శాఖా సిబ్బంది ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సి ఉంటుంది. అంటే టీకా పనిచేసే కాలం 5 నుంచి 6 నెలలు వరకూ ఉంటుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూన్, జూలై నెలల్లో పశువైద్యాధికారులు టీకాలు వేస్తుంటారు. అయితే సకాలంలో టీకాలు వేయకపోవడంతో ప్రాణాంతక గొంతు వాపు వ్యాధి, గాలి కుంటు, చిటుకు వ్యాధులు ప్రబలి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నాయి. గొంతు వాపు వ్యాధి సోకితే ఆవు కానీ, బర్రె కానీ అతి తక్కువ రోజుల్లోనే మృతి చెందుతుంది. చిటుకు వ్యాధి వస్తే గొర్రెలు, మేకలు గంటల వ్యవధిలోనే మరణిస్తాయి. గాలి కుంటు వ్యాధి సోకితే పశువుల మరణాలు తక్కువే అయినా పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. పశువు బలహీనమై పోతుం ది. ఈ వ్యాధుల నివారణకు టీకాలొక్కటే మార్గం. అయితే ముందస్తుగా టీకాలు వేయాల్సిన అధికారులు వ్యాధులు ప్రబలి పశువులు మృత్యువాత పడ్డాక 'చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్నట్టు' ఇప్పుడు టీకాల కార్యక్రమాన్ని చేపడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా పశు వైద్యాధికారులు గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించి పాడి రైతులను చైతన్య పరచాల్సిన అవసరం వుంది.


తక్షణమే శిబిరాలు నిర్వహిస్తాం..

వర్షాల కారణంగా పారిశుద్ధం దెబ్బతిన్న నేపథ్యంలో పశువుల్లో, దూడల్లో గొంతు వాపు వ్యాధి దర్శనమిస్తోంది. వ్యాధి ప్రభావిత గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఇప్పటికే పశువైద్య సిబ్బంది చాలా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సాధారణ పరిస్థితిలు నెలకొనే వరకు పాడి రైతులకు పశు వైద్యులను అందుబాటులో ఉంచుతాం.

- డాక్టర్ ఎన్‌వి శ్రీకాంత్ బాబు, ఏడీఏ.

అమాయకుల్ని మోసం చేస్తున్న ముఠా గుట్టురట్టు

వ్యక్తి అరెస్ట్, రూ25 లక్షల నగదు స్వాధీనం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డిజిటల్ అరెస్టు పేరుతో అమాయకుల్ని మోసం చేస్తున్న ముఠా గుట్టును తిరుపతి పోలీసులు రట్టు చేశారు. మోసానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని అదుపులో తీసుకొని అతను వద్ద నుంచి 24. 5 లక్షల నగదు, రెండు సెల్లు ఫోన్లు, రెండు లాప్‌ట్యాప్స్, 16 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకొని, నిందితుడు అకౌంట్లో నుంచి 24 లక్షల నగదు నిలుపుదల చేసినట్లు తిరుపతి ఇన్‌ఛార్జి యస్పీ మణికంఠ చందోల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన సీనియర్ సిటిజన్ సుమారు 65 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ తన ఇంటిలో ఉండగా వాట్స్‌అప్ ద్వారా ఒక వీడియో కాల్ వచ్చింది. అవతల వ్యక్తి తనను తాను ఢిల్లీ సిబిఐ అధికారులమని చెప్పి 200 కోట్లు మనీ ల్యాండరింగ్ కేసు జరిగిందని, బాధితురాలు పేరుపై ఉన్న బ్యాంక్‌అకౌంట్‌ను చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తూ, లావాదేవీలు జరుపుతున్నారని, అందువల్ల అరెస్ట్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. మాయ మాటలు చెప్పి నమ్మించి ఆమె వద్ద నుంచి 2.5 కోట్లు నగదును వివిధ అకౌంట్లో జమ చేసుకున్నారు. తరువాత వారు స్పందించకపోవడంతో బాధిత మహిళ ఈనెల 13 తేదీన తిరుపతి వెస్ట్ పోలీస్ పోలీసులు సంప్రదించి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోని తిరుపతి సైబర్ క్రైమ్ టీం, వెస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడి అకౌంట్లులో ఉన్న 26 లక్షల నగదు లావాదేవీలను ఫ్రీజ్ చేశారు. ప్రధాన నిందితుడు ఇతర సభ్యుల కోసం సీసీఎస్ పోలీసులతో ప్రత్యే క బృందా లు ఏర్పాటు చేసి, తీవ్రంగా గాలిస్తున్నారు. ఇతనికి సహకరించిన ప్రధాన నిందితుడికి అన్న పాలకొల్లు అరుణ్ వినయ్ కుమార్ రాజమండ్రికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి రూ.24.5 లక్షల నగదు, ఒక ఎక్స్ యువి 700 కారు, రెండు సెల్ ఫోన్లు, రెండు ల్యాప్ టాప్లు, 16 గ్రాములు బంగారు, నేరం చేయడానికి సాంకేతికంగా ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించామన్నారు.